## ‘మార్పు మహత్యం.. యుగాల తర్వాత కరెంట్ సమస్య’

**చేగుంట రైతుల ఆందోళనపై స్పందించిన కేటీఆర్**

తిమ్మాజిపేట, జూలై 20 : కరెంట్ సక్రమంగా సరఫరా కావడం లేదని నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం గొరిట సబ్‌స్టేషన్ ఎదుట చేగుంట గ్రామ రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సబ్‌స్టేషన్ తలుపులకు గడియ పెట్టి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. అయితే శనివారం ఎక్స్ వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఫొటోలను, వీడియోలను ట్యాగ్ చేస్తూ ‘మార్పు మహత్యం.. తెలంగాణలో కరెంట్ కోసం ఇలాంటి నిరసనలు చూసి యుగాలైంది’.. అని రీట్వీట్ చేశారు. వేలాది మంది చూడగా వైరల్‌గా మారింది.



ఎక్స్‌లో చేగుంట రైతుల సమస్యపై స్పందించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## మిర్చి బండి వ్యాపారికి సైబర్ టోకరా

- బ్యాంకు అధికారులమంటూ రూ.91 వేలు స్వాహా

గద్వాల అర్బన్, జూలై 20: ఓ బజ్జిల బం డి వ్యాపారికి సైబర్ నేరగాళ్లు బ్యాంక్ అధికారులమంటూ వాట్సాప్‌కు లింక్‌పంపి రూ.91 స్వాహా చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీస్‌ల వివరాల మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన బజ్జిల వ్యాపారి లగిశెట్టి బాలకృష్ణకు కొన్ని రోజుల క్రితం యూనియన్ బ్యాంక్ పేరుతో వాట్సాప్‌కు ఓ లింక్ వచ్చింది. బ్యాంక్ పేరుతో లింక్ రావడంతో బాధితుడు లింక్ నిజమేనని నమ్మి ఓపెన్ చేసి వివరాలు నమోదు చేశాడు. అనంతరం కొంత సమయానికి బ్యాంక్ అధికారిని అంటు సైబర్ నేరగాడు కాల్ చేసి ఫోన్‌నెంబర్, ఓటీపీ వి వరాలు తెలియజేశాడు. బాధితుడు తన ఇంటిలోన్ 18వ తేదీన కట్టేందుకు పెట్టుకున్న నగదులో రూ.91వేయి డ్రా చేసినట్లు బాలకృష్ణకు మేసేజ్ వచ్చింది. వెంటనే బాలకృష్ణ బ్యాంక్ అధికారులకు తెలుపగా ఖాతాలో నగదు డ్రా అయ్యిందని తెలియడంతో మోసపోయినని గ్రహించి, టౌన్‌పోలీస్‌లను ఆశ్రయించాడు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటినట్లు తెలిపారు.

# కోయిల్‌సాగర్ నిండేనా?

- ప్రాజెక్టుకు నిలిచిన పంపింగ్
- వానకాలం పంటల సాగుకు నీటి విడుదలపై సందిగ్ధం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు


తీలేరు దగ్గర నిలిచిన పంపింగ్

మరికల్, జూలై 20: కేసీఆర్ ప్రభుత్వంలో జురాలకు చిన్నపాటి వరద వచ్చిదంటే చాలు కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు ఉంద్యాల వద్ద నున్న స్టేజ్ -1 పంపింగ్ ద్వారా పర్దిపూర్ చెరువుకు నీటిని విడుదల చేసేది. అటు నుంచి తీలేరు స్టేజ్-2 దగ్గర పంపింగ్‌ను ప్రారంభించి కోయిల్‌సాగర్‌ను కృష్ణానీటితో నింపేవారు. అంతేకాకుండా కోయిల్‌సాగర్ కాల్వల ద్వారా గొలుసుకట్టు చెరువులను కూడా నింపేవారు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జూరాలకు భారీ వరద వచ్చి ఐదు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నా.. కోయిల్‌సాగర్‌కు మా త్రం పంపింగ్ ప్రారంభించడం లేదు. తీలేరు స్టేజీ దగ్గర పంపింగ్ నిలిచి పదిహేను రోజులు కావస్తు న్నా అడిగే నాథుడు లేక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కోయిల్‌సాగర్‌లో 18 అడుగుల నీరు మాత్రమే ఉందని మరో 14 అడుగుల నీరు ప్రాజెక్టులోకి చేరాల్సి ఉన్నది. ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉండడంతో ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తారా లేదా అని రైతులు అయోమయానికి గురవుతున్నారు.

ఆయకట్టు పరిధిలో కొంత మంది రైతులు వరి నారు మడులు వేసుకొని సాగునీరు విడుదల చేసిన వెంటనే నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉండగా ఎక్కువ మంది రైతులు కోయిల్‌సాగర్ నుంచి సాగునీరు విడుదల చేసిన వెంటనే వ్యవసాయ పనులు ప్రారంభించాలని ఎదురు చూ స్తున్నారు. కృష్ణమ్మకు భారీగా వరద వస్తున్న నేపథ్యంలో కోయిల్‌సాగర్‌కు పంపింగ్‌ను ప్రారంభించాలని ఆయకట్టు పరిధిలోని రైతులు కోరుతున్నారు.

### నీటి విడుదలపై నిర్లక్ష్యం

కేసీఆర్ ప్రభుత్వం జూరాలకు వరద ప్రారంభమైన వెంటనే కోయిల్‌సాగర్‌కు పంపింగ్ ప్రారంభించడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండేది. ప్రస్తుతం కోయిల్‌సాగర్‌లో నీరు తక్కువగా ఉండడంతో సాగునీరు విడుదల చేస్తారా లేదా అని అయోమయంలో ఉన్నాం. దీంతో పంటకు సాగునీరు సక్రమంగా అందుతుందో లేదో అని భయమేస్తుంది. నారు మడులు పోసి నెలలు గడుస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల పంపింగ్ ప్రారంభం కాలేదు.

**– గాదం మల్లేశ్, రైతు, రాకొండ, మరికల్ మండలం, నారాయణపేట జిల్లా**

### పంపింగ్ ప్రారంభించాలి

జురాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో 5 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కానీ కోయిల్ సాగర్‌కు పంపింగ్ మాత్రం ప్రారంభించడం లేదు. ఇలా చేస్తే కోయిల్‌సాగర్‌ను ఎప్పుడు నింపుతారు. రైతులకు ఎప్పుడు సాగునీరు విడుదల చేస్తారు. కోయిల్‌సాగర్ అంటే ఎందుకంత చిన్న చూపు. దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు స్పందించి కోయిల్‌సాగర్‌కు పంపింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

**– సత్యనారాయణరెడ్డి, రైతు, పూసల్‌పాడ్, మరికల్ మండల్, నారాయణపేట జిల్లా**

### త్వరలోనే పంపింగ్ ప్రారంభిస్తాం

కోయిల్‌సాగర్‌ను కృష్ణమ్మతో నింపేందుకు ఉంద్యాల్, తీలేరు దగ్గరున్న రెండు మోటర్లను రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తాం. కరెంట్ సమస్య ఉండడంతో కొంత ఆలస్యం అవుతున్నది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పంపింగ్ కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఆయకట్టు రైతులకు కూడా త్వరలోనే సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

**– ప్రతాప్‌సింగ్, ఈఈ నీటిపారుదల శాఖ**

# దొంగలు దొరికారు

- దోపిడీకి పాల్పడిన ప్రేమజంటకు రిమాండ్
- 9 తులాల బంగారం స్వాధీనం, ఆటో సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, జూలై 20 : ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి వారికి మాయమాటలు చెప్పి ఆటోలో తీసుకెళ్లి, బెదిరించి బంగారు ఆభరణాలను దోచుకుంటున్న ప్రేమజంటను రిమాండ్‌కు తరలించినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం రుద్రసముద్రం గ్రామానికి చెందిన షేక్ మహ్మద్, పాలమూరులోని కురిహినిశెట్టి కాలనీకి చెందిన సాభాపతి ఉమతో కలిసి మహబూబ్‌నగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్నారు. పాలమూరులోని బస్టాండ్‌కు వచ్చే వృద్ధ మహిళలను టార్గెట్ చేసి, వారి నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసేవారు. షేక్ మహ్మద్ ఆటోడ్రైవర్ కావడంతో ఒంటరిగా ఉన్న మహిళను ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకుపోయి ఆటోఆపి ఉమాతో కలిసి చంపుతామని బెదిరించి నగలతో ఉడాయించేవారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు ఐదుగురు మహిళలతో 9తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే ధర్మాపూర్, నవాబ్‌పేట, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలుమార్లు చోరీలకు పాల్పడ్డారు. శనివారం అప్పన్నపల్లి బ్రిడ్జీ వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని విచారించగా చోరీలను ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి బంగారంతో పాటు ఆటోను సీజ్ చేశామని, నిందితులను కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించామన్నారు. కేసు ఛేదించిన సీఐ గాంధీనాయక్, ఎస్సై విజయ్ కుమార్, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## భయంనీడలో మారేపల్లి హైస్కూల్

- నెర్రెలిచ్చిన తరగతి గదులు
- వర్షానికి కారుతున్న పైకప్పు


మారేపల్లి పాఠశాలలో పైకప్పు నుంచి కారుతున్న నీరు

తిమ్మాజిపేట, జూలై 20 :మండలం మారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక తరగతి గది పైకప్పు నెర్రెలిచ్చి, వర్షానికి కురుస్తుండడంతో ఉపాధ్యాయులు అప్రమత్తమై విద్యార్థులను మరోచోటికి తరలించారు. దాత సాయంతో దాదాపు ఇరవై యేండ్ల కిందట నిర్మించిన రెండు గదులలో 8, 9 తరగతులను నిర్వహిస్తున్నారు. అయితే 8వ తరగతిలో పైకప్పు నెర్రెలివ్వడంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు కారుతుందని, కొంత కుంగినట్లుగా కనిపిస్తుందని జీహెచ్‌ఎం ప్రేమలత తెలిపారు. దీంతో పాటు 9తరగతి గది గోడలకు షార్ట్‌సర్క్యూట్ అయ్యిందని, వెంటనే డిజిటల్ తరగతులను నిలిపివేశామన్నారు.

మరోవైపు పాఠశాలలో అదనపు తరగతులు లేకపోవడంతో వంటగదిలోకి 8వ తరగతిని తరలించి, అక్కడే విద్యార్థులకు తరగతులను బోధిస్తున్నట్లు చెప్పారు. కాగా పాఠశాలలో టాయిలెట్స్ సమస్య ఉందని అధికారులు స్పందించి అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మీటింగ్స్ కండక్ట్ చేస్తున్నారా?

- నెలవారీగా పోలీస్, అధికారులతో సమావేశాలు విధిగా నిర్వహించాలి
- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి



నారాయణపేట సమీక్షలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి

నారాయణపేట/గద్వాల, జూలై 20 : నెలవారీగా సంబంధింత పోలీస్, సంబంధిత అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్స్ కండక్ట్ చేస్తున్నారా..? అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి ఆరా తీశారు. శనివారం నారాయణపేట జిల్లా కోర్టులో జరిగిన న్యాయమూర్తుల సమీక్షకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కేఎల్‌ఐ క్యాంపులో ఏర్పాటు చేసిన అదనపు సీనియర్ సివిల్, అసిస్టెంట్ సెషన్స్ న్యాయస్థాన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అంతకుముందు పేటలో కలెక్టర్ సిక్తాపట్నాయక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, అదనపు కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్‌కుమార్, డీఎస్పీ లింగయ్యతోపాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అలాగే గద్వాలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.కుషా, కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు సాదరంగా ఆహ్వానం పలికారు. నారాయణపేట జిల్లా కోర్టు సముదాయానికి చేరుకొని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తులందరితో సమీక్ష నిర్వహించారు.

అన్ని కోర్టుల్లో సరిపడా సిబ్బంది ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ పేట జిల్లాలోని అన్ని కోర్టుల్లో సరిపడా సిబ్బంది లేరని, జిల్లా కోర్టులో మీడియేషన్ సెంటర్ లేదని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీనివాస్, గంట కవిత, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఉమర్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి పూజిత, అలంపూర్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కండ్లపురం కవిత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘురాంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వాణిజ్య



అబ్దుల్ కలామ్ టెక్నికల్ వర్సిటీ ప్రతినిధులతో టీ హబ్‌వర్గాలు

## టీ హబ్‌తో అబ్దుల్ కలామ్ వర్సిటీ జట్టు!

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో కలిసి పనిచేసేందుకుగాను ఉత్తరప్రదేశ్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం ముందుకొచ్చింది. రెండు రోజులపాటు టీ హబ్ కార్యకలాపాలను పరిశీలించిన ప్రతినిధుల బృందం శనివారం..అక్కడ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు టీ హబ్‌తో కలిసి పని చేయనున్నట్లు అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరాలకు అనుగుణంగా రూపొందించడంలో టీ హబ్ దూసుకుపోతున్నదని, తమ యూనివర్సిటీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేలా త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రైవేట్ రంగంలోని కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు కూడా తమతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని టీ హబ్ ప్రతినిధి వెల్లడించారు. స్టార్టప్‌లకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు టీ హబ్ ద్వారా లభిస్తున్నాయని..అలాగే దేశ, విదేశాలకు చెందిన పలు సంస్థలు సందర్శించడంతో పాటు కలిసి పనిచేసేందుకు వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకుంటున్నాయని తెలిపారు.

# పీఎస్‌యూలకు ముప్పుతప్పినట్టేనా?

## ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గనున్న ఎన్డీఏ సర్కారు

### రాష్ట్రంలోని ఆరు ప్రభుత్వ సంస్థలకు కొత్త ఆశలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవాలని చూస్తున్న నరేంద్ర మోదీ సర్కార్ ఈసారికి కాస్త వెనుకడుగు వేసే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయిలో మెజార్టీ రాకపోవడం, మరోవైపు ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పీఎస్‌యూల ప్రైవేటీకరణపై మోదీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణపై అత్యంత దూకుడుగా వ్యవహరించింది. ఫలితంగా దేశవ్యాప్తంగా 35 పీఎస్‌యూలు ప్రైవేటుపరం అయ్యాయి. మారిన రాజకీయ పరిణామాలతో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగలడంతో సంకీర్ణ సర్కారు తమ ప్రాధాన్యతలను మార్చుకున్నట్లు తెలుస్తున్నది. ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాలు ప్రైవేటీకరణకు ఒప్పుకునే అవకాశాలు లేకపోవడంతో మోదీ సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ప్రైవేటీకరణకు మొగ్గుచూపకుండా..కేవలం వాటాని పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి ఇటీవల పలువురు కేంద్ర మంత్రుల వ్యాఖ్యలు కూడా ఇందుకు బలంచేకూరుతున్నది. దీంట్లోభాగంగా రాష్ట్రంలో ఉన్న ఆరు ప్రభుత్వరంగ సంస్థలకు ఉపశమనం లభించే అవకాశాలున్నాయి.

**రాష్ట్రంలో ప్రైవేటీకరణకు ప్రతిపాదిత సీపీఎస్‌యులు, వాటి ఆధీనంలోని భూములు(ఎకరాల్లో)..**

| | | |
|---|---|---|
| 1. | హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్(హెసీఎల్) | – 324.87 |
| 2. | హిందుస్థాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్ | – 126.32 |
| 3. | ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్(ఐడీపీఎల్) | – 551.03 |
| 4. | హెచ్ఎంటీ వాచెస్ | – 888.05 |
| 5. | సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీసీఐ) | – 2,272.85 |
| 6. | ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ | – 3,020 |
| | మొత్తం | - 7,183.12 ఎకరాలు |

**మూతపడిన 10 సంస్థలు..**

రాష్ట్రవ్యాప్తంగా పది ప్రభుత్వరంగ సంస్థలు మూతపడ్డాయి. ఒకానొక దశలో 27 సంస్థలు ఇక్కడ కార్యకలాపాలను కొనసాగించగా, ఆర్థిక ఇబ్బందులు, నిధులు కేటాయింపులు లేకపోవడంతో పది సంస్థలు మూతపడ్డాయి. దీంతో వీటి సంఖ్య 17కి పరిమితమయ్యాయి. ఈ మూతపడిన పది సంస్థల్లో ఆరింటిని పూర్తిగా వదిలించుకోవాలని కేంద్ర సర్కార్ గతంలోనే ఎత్తుగడ వేసింది. కానీ కేసీఆర్ సర్కార్ తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది. అయితే నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఉన్న కంపెనీల భూములను విక్రయించాలంటే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలుపాల్సి వుంటుంది. ఈ క్రమంలోనే ఆరు సీపీఎస్‌యూల ప్రైవేటీకరణకు ఆమోదం తెలుపాలని రాష్ట్ర సర్కార్‌పై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది.





### హెచ్ఎంటీ తెరుచుకునేనా..

ఒకప్పుడు దేశానికి సమయం చూపించిన హెచ్ఎంటీ ప్రస్తుత ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. పీఎస్‌యూలను పట్టించుకోకుండా ప్రైవేట్ రంగ సంస్థలనే ప్రోత్సహిస్తున్న కేంద్ర సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో ఎన్నో సంస్థలు మూతపడ్డాయి. వీటిలో దేశానికి సమయం చూపించిన హెచ్ఎంటీ కూడా ఉన్నది. ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగించిన ఈ సంస్థ తయారు చేసిన గడియారాలే ఎక్కువగా అమ్ముడయ్యాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రైవేట్ రంగ సంస్థలనుంచి పోటీ పెరగడం, నిధులు కేటాయింపులు తగ్గిపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసింది. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటీవల కాలంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామి రాష్ట్ర పర్యటన సందర్భంగా హెచ్ఎంటీ ప్లాంట్‌ను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హెచ్ఎంటీని పునరుద్ధరించి తమ ఉద్యోగాలు కాపాడాలని, తమకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరారు. దీనిపై కుమార స్వామి సానుకూలంగా స్పందించారు. హెచ్ఎంటీ పునరుద్ధరించడంతోపాటు ఆక్రమణకు గురవుతున్న హెచ్ఎంటీ భూములను కాపాడుతామని ఆయన హామీ ఇచ్చారు.

## ఎల్ఐసీ దూకుడు

### 74 శాతం రిటర్నుపంచిన సంస్థ




న్యూఢిల్లీ, జూలై 20: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ మళ్లీ తన పూర్వవైభావాన్ని సంతరించుకుంటున్నది. స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన మొదట్లో భారీగా పతనమైన కంపెనీ షేరు తిరిగి నేలకు కొట్టిన బంతిలా దూసుకుపోతున్నది. గడిచిన ఏడాదికాలంలో అత్యధికంగా రిటర్నులు పంచిన షేరు ఎల్ఐసీదే కావడం విశేషం. దేశీయ టాప్-10 దిగ్గజ సంస్థల్లో ఎల్ఐసీ షేరు 74 శాతం రిటర్నులు పంచింది. దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ 68 శాతం రిటర్నులు పంచగా..బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) 47.64 శాతం రిటర్నులు పంచింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. దేశీయ అత్యంత విలువైన రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం 10 శాతం మాత్రమే మార్కెట్ విలువ పెరగగా.. ఐసీఐసీఐ బ్యాంక్ 28 శాతం, టీసీఎస్ 25 శాతం, ఇన్ఫోసిస్ 22 శాతం చొప్పున బలపడ్డాయి.


**గతేడాదికాలంలో సంస్థల షేర్ల పెరుగుదల రూపాయల్లో..**

| కంపెనీ | 19 జూలై 19 2023 నాటికి | నాటికి జూలై 2024 | తేడా (శాతంలో) |
|---|---|---|---|
| ఎల్ఐసీ | 620.4 | 1,080.1 | 74.10 |
| భారతీ ఎయిర్‌టెల్ | 869.8 | 1463 | 68.20 |
| ఎస్బీఐ | 601.35 | 887.85 | 47.64 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 973.65 | 1248.15 | 28.19 |
| టీసీఎస్ | 3,471 | 4,330.25 | 24.76 |
| ఇన్ఫోసిస్ | 1,474.35 | 1,807.7 | 22.61 |
| రిలయన్స్ | 2,840 | 3,138.35 | 10.51 |
| హెచ్‌యూఎల్ | 2,671.75 | 2,725 | 1.99 |
| ఐటీసీ | 478.85 | 475.05 | -0.79 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 1,684.85 | 1,613.9 | -4.21 |

## ‘బిల్డర్లకు రాయితీలివ్వండి’

### వచ్చే బడ్జెట్‌పై క్రెడాయ్

న్యూఢిల్లీ, జూలై 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న సార్వత్రిక బడ్జెట్‌లో గృహ కొనుగోలుదారులకు, తక్కువ ధరతో ఇండ్లను నిర్మించే బిల్డర్లకు మరిన్ని పన్ను ప్రయోజనాలు కల్పించాలని రియల్టీ బాడీ క్రెడాయ్ కోరుతున్నది. రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ గాడినపడాలంటే కేంద్ర ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహక నిర్ణయాలు తీసుకోవాలని, ముఖ్యంగా పన్ను రాయితీలు కల్పించినప్పుడే ఈ రంగ సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే అవకాశాలున్నాయని పేర్కొంది. కొత్తగా గృహాలు కొనుగోలుచేసేవారికి వడ్డీ రాయితీని పెంచాలని, అలాగే మళ్లీ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీంను ప్రవేశపెట్టాలని, అప్పుడే చౌక ధర కలిగిన గృహాలకు డిమాండ్ ఉంటుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. ప్రస్తుతం రూ.2 లక్షలుగా ఉన్న డిడెక్షన్‌ను రూ.5 లక్షలకు పెంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరుతున్నట్లు చెప్పారు.


బడ్జెట్ (2024-25)

## నిరాశపరిచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

### క్యూ1లో రూ.16,474 కోట్ల లాభం




ముంబై, జూలై 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,474 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.12,370 కోట్ల లాభంతో పోలిస్తే 33 శాతం ఎగబాకగా, జనవరి-మార్చి త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మాత్రం 6.5 శాతం తగ్గింది. బ్యాంక్ ఆదాయం మాత్రం రూ.57,816 కోట్ల నుంచి రూ.83,701 కోట్లకు ఎగబాకింది.

- నికర వడ్డీ ఆదాయం 2.6 శాతం ఎగబాకి రూ.29,840 కోట్లకు చేరుకున్నది. వడ్డీయేతర ఆదాయం మాత్రం 41.3 శాతం తగ్గి రూ.10,670 కోట్లకు పరిమితమైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.2,602 కోట్ల నిధులను వెచ్చించింది. క్రితం ఏడాది కేటాయించిన రూ.13,511 కోట్ల కంటే ఇది తక్కువ.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.24 శాతం నుంచి 1.33 శాతానికి పెరిగాయి.
- కొత్తగా శాఖలను ప్రారంభించడంతో మొత్తం శాఖల సంఖ్య 8,800లకు చేరుకున్నాయి.
- గత త్రైమాసికంలో కొత్తగా రూ.7,900 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.
- పన్నుల కోసం ఒకేసారి రూ.5,107 కోట్ల నిధులు వెచ్చించడంతో ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపింది.
- తాకట్టుకింద పెట్టిన ఆస్తులను విక్రయించడంతో రూ.5 వేల కోట్ల నిధులు సమకూరాయి.

### అంచనాలుమించిన యూనియన్ బ్యాంక్

ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.3,679 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 13.7 శాతం వృద్ధిని కనబరిచింది. వడ్డీల మీద వచ్చే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 6.5 శాతం పెరిగి రూ.9,412 కోట్లు సమకూరడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. అలాగే ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం 15.53 శాతం ఎగబాకి రూ.4,509 కోట్లకు చేరుకున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో ఏ మణిమేఖలై తెలిపారు. కొత్తగా రూ.2,318 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.54 శాతంగా నమోదైంది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.4,106 కోట్ల నిధులను వెచ్చించింది. ప్రభుత్వరంగ సంస్థలతోపాటు ప్రైవేట్ రంగ కంపెనీల నుంచి రుణాలకు డిమాండ్ అధికంగా ఉన్నదన్నారు. గత త్రైమాసికంలో కార్పొరేట్ రుణాలు 7 శాతం అధికమవగా, విద్యా, పసిడి రుణాలు 40 శాతం చొప్పున పెరిగాయి.

## 22 నుంచి అసోచామ్ సదస్సు

హైదరాబాద్, జూలై 20: ఈ నెల 22 నుంచి 23 వరకు హైదరాబాద్ వేదికగా బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అసోచామ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. షార్జా ప్రభుత్వం, తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్తంగా జరుగుతున్న ఈ సమావేశాల్లో యూఏఈలో వ్యాపార అవకాశాలు, పెట్టుబడులపై ప్రధానంగా చర్చించనున్నట్లు అసోచామ్ ఏపీ-తెలంగాణ చైర్మన్ రవి కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి చెందిన సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి ఈ సమావేశం కీలకం కానున్నదన్నారు.

### కొటక్ బ్యాంక్ ఫర్వాలేదు

న్యూఢిల్లీ, జూలై 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.3,520 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది కొటక్ మహీంద్రా బ్యాంక్. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.3,452 కోట్ల లాభంతో పోలిస్తే 2 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.13,183 కోట్ల నుంచి రూ.15,675 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.39 శాతంగా నికర ఎన్‌పీఏ 0.35 శాతానికి దిగొచ్చాయి.